
నవ్య వీక్లీ - జనార్ధన మహర్షి సంయుక్తంగా నిర్వహించిన
కథల పోటీలో బహుమతి పొందిన కథ

# నేల



“ఇవాళ మీ బిల్డింగ్ ప్లాన్ మొదలెట్టేస్తాను సార్” ఆర్కిటెక్ట్ రమణ ఫోన్‌లో చెప్పాడు.

“ఇంకో రెండ్రోజులాగండి. ఆఖరి ప్రయత్నం చేస్తాను...” బిల్డర్ రత్నాకరరావు అన్నాడు.

“ఫ్లాట్ మధ్యలోని ఆ ముక్క కలిసిందా బిల్డింగ్ బ్రహ్మాండంగా ఎలివేట్ అవుతుంది. కాస్త ఎక్కువిచ్చి అయినా అతడ్ని ఒప్పించగలిగితే మీకో ప్రెస్టేజియస్ ప్రాజెక్టు అవుతుంది...”

“ఆ మొండి బ్రామ్మడికి తిక్కెక్కువండీ. ఎన్నాళ్ళ నుంచి ఎన్ని రకాలుగా ప్రయత్నించానూ! ఫ్చ్. సైట్‌ని డెవలప్‌మెంట్‌కి ఇమ్మనగానే ఎగిరిగంతేస్తారంతా. కొందరు అదనంగా కొన్ని ఫెసిలిటీస్ ఇమ్మంటారు తప్ప ఇలా ఇంతదాకా ఎవరూ భీష్మించలేదు. ఏవిటో ఆయన అదోరకం మనిషయ్యాడు నా ప్రాణానికి! అయినా ఇంకోసారి ప్రయత్నించి చూస్తాను...” సాలోచనగా అన్నాడు.

“మీకు సాధ్యం కానిది ఉంటుందనుకోను. సరే అయితే ఇంకో వీక్ చూద్దాం...”

రమణ ఫోన్ పెట్టేశాడు. ఆలోచనలో పడ్డాడు రత్నాకరరావు. ఎందుకో చాలా ఉద్విగ్నంగా ఉందతడికి. తనలో తను రగిలిపోతున్నాడు.

“ఏవిటలా ఉన్నారూ” భార్య అడిగింది.

“ఎలా నరుక్కొస్తే ఆ ముసలాయన నా దారి కొస్తాడా అని”

“దాని గురించే అతిగా ఆలోచిస్తూ ఊరికే హైరాన పడకండి. అసలే బరువు బాగా పెరిగారని వాకింగ్ చెయ్యమని డాక్టర్ మరీ మరీ చెప్పాడు. వాకింగూ లేదు పాడూ లేదు గాని లేనిపోని టెన్షన్లు నెత్తికెక్కించుకుంటున్నారు!”

“వాళ్ళేదో చెబుతూంటార్లేవే. డబ్బుంటే ఆరోగ్యం అదే నడిచొస్తుంది...”

“అలాగని డాక్టర్ చెప్పిన జాగ్రత్తల్ని అశ్రద్ధ చేస్తే ఎలాగ!”

“ఈ గొడవ ఓ కొలిక్కి వచ్చేస్తే ఇహ ఏడాది వరకూ ఈ వెంచరూ నా ఆరోగ్యం తప్ప ఇంకేం పట్టించుకోను”

“మీరీ రంధిలోంచి ఎప్పుడు బయటపడతారో ఏమో!” గొణుక్కుంటూ లోపలి కెళ్ళిపోయింది.

రత్నాకరరావుకి కొత్త ఆలోచనేమీ తట్టలేదు. ‘కొరకరాని కొయ్యలా తయారయ్యాడు’ విసుక్కున్నాడు. ‘ఇంకోసారి నయాన చెప్పి చూద్దాం’ అనుకుంటూ బయల్దేరాడు.

తనే డ్రైవ్ చేసుకుంటూ హౌసింగ్‌బోర్డు కాలనీకి వెళ్ళాడు.

ఎప్పుడో పాతికేళ్ళ క్రితం సిటీకొచ్చినప్పుడు ఈ కాలనీలోనే చిన్న గది అద్దెకు తీసుకుని ఉన్నాడు. ఉద్యోగం రాలేదు. పెయింట్స్ షాపులో గుమస్తాగా చేరాడు. పెయింట్స్ తెలిశాయి. పెయింటర్స్ పరిచయమయ్యారు. పెయింటింగూ తెలిసింది. పెయింటింగ్ కాంట్రాక్టులు మొదలెట్టాడు. అయిదేళ్ళలో అందులో ఆరితేరాడు. మరి నలుగుర్తో కలిసి

బిల్డింగ్ కనస్ట్రక్షన్‌లోకి దిగాడు. రెండు వెంచర్లకే అనుపానులు తెలిశాయి. ముఖ్యంగా డబ్బు వడ్డీకిచ్చేవాళ్ళు 'బాగా' పరిచయమయ్యారు.

స్వంత హౌసింగ్ సంస్థని స్థాపించాడు. ఈ కాలనీలోనే పది వెంచర్లు చేసాడు. అమ్మకపు సులువులు బాగా ఒంటబట్టాయి. రెసిషన్ టైంలో మొదలెట్టిన ఒక్కదాన్లో తప్ప అన్నిట్లోనూ రూపాయికి రూపాయి మిగిలింది.

అనుకోకుండా కాలనీ బస్టాండు దగ్గర్లో రోడ్డు కానుకుని ఉన్న రెండు ఎమ్ఐజీలు డెవలప్‌మెంటుకొచ్చాయి. అవి ఒకదాని వెనుక ఇంకోటి ఉన్నాయి. సన్నగా పొడుగ్గా వస్తుంది బిల్డింగు. అందుకని ప్రక్క వాళ్ళ కోసం ప్రయత్నించాడు. వాళ్ళు మెత్తబడలేదు గానీ ఆ ప్రక్కనున్న ఇద్దరు ముందు కొచ్చారు. ఆ తర్వాత ఆ రెంటికీ మధ్యలో-వెనక భాగాన ఉన్న ఎమ్ఐజీ అతనూ అంగీకరించాడు.

ఇహ రోడ్డు వైపున్న యమ్ఐజీ ఒక్కటీ మిగిలి ఉంది. అది వచ్చేస్తే మొత్తం 1800 గజాలవుతుంది. అదిరిపోయే లెవెల్లో జి + 4 నిర్మించొచ్చు. సెంటర్లో ఉంది గనుక ఫ్లాట్స్ హాట్ కేక్స్‌లా అమ్ముడైపోవడం ఖాయం. అసలు ఎడ్వాన్సులతోనే నిర్మాణం పూర్తి చేసెయొచ్చు!

కానీ సదరు ఎమ్ఐజి శర్మ మొండిఘటం. చిలక్కి చెప్పినట్లు చెప్పినా ఒప్పుకోలేదు. అతడు దారిలో కొస్తాడన్న ధీమాతో చుట్టూ ఉన్న అయిదుగురితోనూ అగ్రిమెంట్లు చేసుకున్నాడు. హౌసింగుబోర్డువారు కట్టిన బిల్డింగుల్నీ పడగొట్టేశాడు. అయినా శర్మ ఎక్కడా లొంగి రాలేదు. అటూ ఇటూ ఉన్న వారితో శర్మకి చెప్పించాడు.

"ఆయనంతే, అంటీ ముట్టనట్టుంటాడు. తామరాకు మీది నీటి బొట్టులా అంటారే అలాగనుకోండి. అదో తరహా మనిషి" అన్నారొకరు.

"పురాణ కథల్లో చదివేమే అలాగ ఋషుల్లా పర్ణశాల నిర్మించుకుని తన ధ్యానం, తన పూజలూ, తన గొడవా, తన తిండీ తప్ప చుట్టూ ఓ ప్రపంచం ఉన్న సంగతే పట్టించుకోడు. చిత్రమైన మనిషి" అని వ్యాఖ్యానించారింకొకరు.

ఆయన్ని ఇంకెలా ఒప్పించాలో పాలుపోవట్లేదు. ఆయనొప్పుకుని ఉంటే ఈ పాటికి వర్కు ఫుల్ స్వింగులో నడుస్తూండేది. బుక్కింగులూ మొదలయ్యేవి. కేవలం ఆ ముక్క వల్ల ఎంతలేదన్నా ఒక కోటి అదనంగా మిగిలేది! ప్చ్!

కసిగా పెదవి కొరుక్కున్నాడు.

శర్మ ఇంటి ప్రక్కన పడగొట్టిన బిల్డింగు ప్రదేశంలో కారుని పార్కు చేసి చుట్టూ పరిశీలనగా చూసాడు రత్నాకరరావు.

'U' ఆకారంలో ఉంది తను డెవలప్‌మెంట్‌కు తీసుకున్న స్థలం. శర్మ ఇంటి ముక్క కలిస్తే దీర్ఘ చతురస్రం అవుతుంది. రోడ్డు ముఖానికి నాలుగేసి చొప్పున

ఎపార్ట్‌మెంటులొస్తాయి!

'తన' స్థలం మధ్యలో దిష్టిపిడతలా ఉంది శర్మ ఇల్లు!

నిట్టూర్చి 'ఇదేమైనా ఇంద్ర భవనమా దీన్ని పట్టుకుని వేళ్ళాడుతున్నాడీ పిచ్చోడు!' అనుకుంటూ చూశాడు.

శర్మది మూడొందల గజాల్లో ఎప్పుడో హౌసింగుబోర్డు వారు కట్టిన రెండు చిన్న గదుల డాబా ఇల్లు. పాతబడి నల్లని చారికల్తో చిలుంపట్టిన రాగి బిందెలా అసహ్యంగా ఉంది. దాని మొఖాన ఇంత వెల్లవేసి ఏ పదేళ్ళో అయ్యుంటుంది. చుట్టూ ఇనుప కంచె. ముందు భాగాన అతుకుల చెక్క తలుపు. లోపల మామిడి, జామ, కొబ్బరి, వేప, పనస, కరివేపాకు, బొప్పాయి ఇలాటివే ఇంకా ఏవేవో చెట్లున్నాయి. ఇక ఎన్ని రకాల కాయగూరల మొక్కలూ పాదులూ ఉన్నాయో లెక్కేలేదు. డాబాకి అటూ ఇటూ రేకుల్తో వసారా షెడ్లు దించారు. వాటిమీదా తీగలు పాకించారు!

ఆ డాబా వంక నిరసనగా చూసాడు రత్నాకరరావు. తన భారీ శరీరాన్ని ఈడ్చు కుంటూ చెక్క తలుపు త్రోసుకుంటూ లోపలి కెళ్ళాడు.

"శర్మగారూ!"

పెరట్లో మొక్కల పని చేస్తోన్న శర్మ మట్టి చేతుల్తోనే, కళ్ళతోనే 'ఎవరూ' అని ప్రశ్నిస్తూ వచ్చారు.

ఆయన సన్నగా బక్కగా ఆస్తిపంజరానికి తోలు కప్పినట్టుగా ఉన్నారు. అంగవస్త్రం కట్టుకున్నారు. మెడలోని జంధ్యం కూడా వెలసిపోయివుంది. లావు పాటి అద్దాల కళ్ళజోడు ధరించారు. తలమీద తక్కువ నలుపూ ఎక్కువ తెలుపూ కలగలిసిన జుట్టు 'నిర్లక్ష్యంగా' ఉంది.

"కాస్సేపు కబుర్లు చెప్పుకుందాం రండి, ఎంతైనా ఇరుగు పొరుగు వాళ్ళం..."

చిన్నగా నవ్వి వెళ్ళి చేతులు కడుక్కుని లోపల్నుంచి రెండు పాత ఇనుప కుర్చీలు తెచ్చి వేశారు.

ఆయన కూర్చోమనే లోపే చతికిల బడ్డాడు రత్నాకరరావు. కాస్సేపు నిలబడినందుకే కాళ్ళు పీకేస్తున్నాయి మరి. కుర్చీ అరిచింది. విరిగిపోతుందేమోనని భయపడ్డారు – శర్మకాదు రత్నాకరరావే.

ముసలావిడ రెండు స్టీలు గ్లాసుల్తో మంచి నీళ్ళు తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది.

ఆమె నుదుట మెరుస్తోన్న రూపాయి కాసంత బొట్టూ, పచ్చని మొఖంలో పరచుకున్న అభిమానం అతడ్నాకర్షించాయి. నూలు చీర కట్టుకుని సాదాసీదాగా ఉన్నా ఏదో పెద్దరికం మరేదో పవిత్రత ఉట్టి పడుతున్నాయి.

అయినా కాని రత్నాకరరావు మొఖం చిట్లించాడు. 'అన్నీ ఉన్నా అనుభవించలేని

రాత రాసి ఉండటమంటే ఇదే మరి' అనుకున్నాడు తనలో.

"ఎలా ఉన్నారు బామ్మగారూ. మీ ఆరోగ్యం ఎలా ఉందీ!" అభిమానం ఒలకబోశాడు.

"బాగానే ఉంది నాయనా. ఆ భగవంతుడి దయవల్ల నా పని నేను చేసుకు పోగలుగుతున్నాను. నీకు ఇద్దరు పిల్లలన్నావు కదూ, ఎలా ఉన్నారూ!"

"మహారాజు బిడ్డల్లా ఉన్నారు. ఒకరు ఊటీలో, రెండోవారు వైజాగ్‌లో చదువు కుంటున్నారు. చదువయ్యాక అమెరికా వెళ్ళి కోట్లు సంపాదిస్తారు"

"చాలా సంతోషం నాయనా"

"నాకు తెలీక అడుగుతానూ, ఈ వయస్సులో మీకీ కష్టాలెందుకు చెప్పండి బామ్మగారూ. హాయిగా కాలు మీద కాలేసుకుక్కూర్చుని జమిందారులా నలుగురు పనోళ్ళతో సేవలు చేయించుకోవచ్చు కదండీ!"

ఆవిడ కళ్ళు చిట్లించి రత్నాకరరావు వంక సూటిగా చూసింది. తడబడ్డాడు.

"నా బాగూ ఓగూ చూట్టానికి ఈయనున్నారు. ఈయన్ని చూట్టానికి నేనున్నాను. మమ్మల్ని కన్న తల్లిలా కనిపెట్టుకు చూట్టానికి ఈ ఇల్లూ, ఈ నేలా, ఈ చెట్లూ, ఈ పుట్టలూ ఉన్నాయి. మాకేం లోటు చెప్పు. మా తనువులు ఇలా కాలూ చెయ్యీ ఆడుతుండగానే వెళ్ళిపోతే అంతే శాన!"

"వజ్ర వైఢూర్యాల్లాంటి ఇద్దరు బిడ్డలున్నారు కదా. మీ చాదస్తం గాకపోతే, వాళ్ళ దగ్గరికెళ్ళి ఉండొచ్చుగా. మిమ్మల్నీ మీ ఇంటినీ చూస్తోంటే నాకే గుండెలు తరుక్కు పోతున్నాయి. ఇక మీ పిల్లలెందుకు పట్టించుకోవట్లేదో నాకు బొత్తిగా అర్థం కావట్లేదు"

వేదాంతిలా నవ్వేరు శర్మ. "మనింట్లో మనం ఉండాలిగాని ఎవరో ఇంట్లో ఉంటే అది మన ఇల్లవ్వుద్దా నీ పిచ్చిగానీ!"

"మీ అబ్బాయి ఇల్లు మీదే కదా"

"మా అబ్బాయి ఇల్లు అని నువ్వే అంటున్నావుగా నాయనా. ఇక మాదెలా అవుతుందీ! అయినా ఎక్కడా నాకు మడీ దడీ కుదరవు. మొక్కల్ని సాకందే ఈయనకి నిద్రపట్టదు. కడుపులో చల్ల కదలకుండా గడిచిపోతోంది. ఫలానాది లేదన్నది లేదు. ఈ జన్మకిది చాలు" ఖాళీ గ్లాసుల్ని తీసుకుని వెళ్ళిపోయిందావిడ.

రత్నాకరరావు మొఖం కోసిన కందగడ్డ అయింది. దాన్ని కప్పి పుచ్చుకుంటూ పెద్దగా నవ్వేశాడు.

"నేనింతమందిని చూశాను గాని మీలాంటి వాళ్లని ఎక్కడా చూడలేదంటే నమ్మండి" శర్మతో అన్నాడు.

"పోనీలెండి" భావరహితంగా అన్నారు శర్మ.

రత్నాకరరావు పెదాలి మీది నవ్వు విరిగిపోయింది.

"వచ్చేవారం భూమి పూజ చేస్తున్నాను. రెండు నెలల పాటు దుమ్మూ ధూళీ వచ్చి పడతాయి. గోలగోలగా ఉంటుందంతా. ఏమీ అనుకోకండి శర్మగారూ" విషయ ప్రస్థావనకి నాందిగా అన్నాడు.

"మీ నేలలో మీరేం చేసుకుంటారో అది మీ ఇష్టం"

ఆయన నిర్లిప్తతకి మండుకొచ్చింది. అవసరం తనది గనుక నిగ్రహించుకోక తప్పింది కాదు.

"మీ ఇంటి చుట్టూ వస్తుంది నా బిల్డింగు. అయిదారంతస్తులు వేస్తాను..."

"గాలికీ వెలుతురుకీ మాకేం ఇబ్బంది ఉండదు..."

"ప్రక్కన కన్‌స్ట్రక్షన్ జరుగుతోంటే ఇబ్బంది లేకుండా ఎలా ఉంటుంది గానీ, ఇప్పటికైనా మీ మంకుపట్టు వదిలేయండి శర్మగారూ. అందరికీ 40% ఇచ్చాను. మీకు 50% ఇస్తాను. మిగతా ఎపార్టుమెంట్లతో సంబంధం లేకుండా మీకెలా కావలిస్తే అలా పూజగదీ, మాడ్యులార్ కిచెన్‌తో సహా ప్రతీదీ ప్రత్యేకంగా కట్టిస్తాను. నా ఖర్చుతో ఏసీ కూడా పెట్టిస్తాను. అదీగాక ఇంకో రెండు ఎపార్టుమెంట్లూ మీ వాటాకి వస్తాయి. నెలొచ్చేసరికి అద్దె రూపేణా ముప్పై వేలొచ్చి మీ చేతిలో పడతాయి. ఎవరి మీదా ఆధారపడక్కర్లేకుండా ఎలాంటి బాదరబందీ లేకుండా బతికేయొచ్చు. మీ తదనంతరం చెరో ఫ్లాటూ మీ పిల్లలకు ఇవ్వొచ్చు. కాదూ కూడదూ అంటే అదిగో నా కారు చూశారుగా అలాటిదే కొత్తది కొని బహుమతిగా ఇస్తాను. కాదనకండి..." ముందుకి వంగి ఆయన మేలుకోరుతున్నవాడిలాగా మొఖం పెట్టి మరీ చెప్పేడు.

"మమ్మల్నిలా ఉండనీయండి చాలు..."

"మళ్ళీ అదే మాట. విలాస వంతమైన జీవితం కోరి వస్తోంటే వద్దనటం ఏం బావోలేదు శర్మగారూ. మీకు చెప్పేంత వాడ్ని కాదు గాని బతికిన నాలుగు రోజులూ సుఖంగా హ్యాపీగా బతకాలి. నాలుక కోరిన తిండి తినాలి. కంటికి నచ్చిన బట్ట కట్టాలి. టీవీ, ఏసీ, సోఫాలు, కారు గట్రా కొనాలి. అప్పుడే సుఖం సంతోషం బాగూ ఓగూ అన్నీ మనింట్లోకి నడిచొస్తాయి"

"ఇప్పుడు మా బాగుకేం లోటొచ్చిందయ్యా..." పెదాలు విడీవిడకుండా నవ్వేరు శర్మ.

"ఇది బాగంటారా? అణ్ణణ్ణ. కానే కాదు. ఈ అడ్డపంచె ఈ అవతారం, మసి బారిన ఇల్లు, పిచ్చిగా చీదరగా పెరిగిన చెట్లూ పుట్టలూ... అబ్బే. మీరు కాబట్టి ఉంటున్నారు. మానవ మాత్రుడెవరూ ఇలాంటి అడివి ఇంట్లో ఒక్క గంట కూడా ఉండలేరంటే నమ్మండి. ఇంత పెరడుకి చాకిరీ చెయ్యలేక పాపం బామ్మగారి నడుం పడిపోతూ ఉంటుంది. నేత చీరలు కడుతోన్న ఆవిడకి పట్టు చీరలు కొని మెడకీ చేతులకీ నాలుగు

రకాల ఆభరణాలు కొని మోడ్రన్ కిచెన్ని గిఫ్టుగా ఇవ్వండి, ఎంత హ్యాపీగా ఫీలవుతారో మీరే చూద్దురు గానీ...!" ఇలాంటి 'పెన్నిధి' తనకే లభించినట్టు ఉబ్బిపోతూ సంబరంగా చెప్పేడు రత్నాకరరావు.

"మేం చీకూ చింతా లేకుండా ఉన్నాం. కమ్మగా నిద్ర పోతున్నాం నాయనా. పప్పు తాలింపుకి కావాలంటే చటుక్కున రొబ్బ వంచి నాలుగు కరివేపాకులు దూసి మూకుట్లో వేస్తా. కొబ్బరి పచ్చట్లోకి కావలిస్తే నాలుగు కొత్తిమీర ఆకులు అలా తుంచి ఇలా రోట్లో వేసి కుమ్ముతాను. మామిడికాయకి కొబ్బరికాయకి దేనికీ ఒకరి ముందు దేహీ అని యాచించక్కర్లేకుండా జరిగిపోతోంది. ఇంతకంటే ఏం కావాలి చెప్పు? పనస బాగా కాసిందంటే ఈ చుట్టు ప్రక్కల పిల్లలందరికీ తొనలు పందేరాలు పెడతాం. ఇహ కథ వచ్చినా కార్యం వచ్చినా పండగొచ్చినా పబ్బం వచ్చినా నాలుగు మామిడాకుల కోసం అంతా వచ్చి పట్టుకెళ్తూనే ఉంటారు. అందరికీ ఏదోటి పెట్టే భాగ్యం కన్నా ఇంకేం కావాలి చెప్పు నాయనా" అతడి మాటలు విని గుమ్మంలో కొచ్చి అంది ముసలావిడ.

ఆవిడ ధోరణికి హతాశుడయ్యాడు. మొహం ఎర్రగా చేసుకుని మిర్రి చూశాడు. 'దొందూ దొందే' అనుకునే సరికి విసుగుతో కూడిన కోపం పొడుచుకొచ్చింది.

"ఈ మట్టి మశానంలో మీకేం రత్నమాణిక్యాలు కన్పిస్తున్నాయో నాకైతే తెలీట్లేదు. మనది పోయేకాలమే గాని వచ్చేకాలం కాదు. ఈ జానెడు నేలకోసం తాపత్రయ పడటం మానేసి డీలక్స్ ఎపార్ట్‌మెంట్లో కృష్ణా రామా అనుకుంటూ సేద దీరటం అన్ని విధాలా మంచిది. ఏమంటారు?"

"మాకీ ఇల్లూ వాకిలీ బాగుంది. మాకిది చాలు. నువ్వే ఈ కాస్త జాగా కోసం అనవసరంగా తాపత్రయ పడుతున్నావు. అటూ ఇటూ అన్ని ప్రక్కలా కొన్నావుగా. దానితో తృప్తి పడిపో..."

ఆయన మాటలకు రత్నాకరరావుకు మండింది.

ఇంతలో శర్మ లేవబోతే కంగారుపడ్డాడు.

"కూర్చోండి కూర్చోండి. మీతో నాలుగు మాటలు మాట్లాడాలనొస్తే అలా లేచిపోతారేంటి"

"పనికిరాని కబుర్లతో పొద్దుపుచ్చే బదులు ఇంకే పని చేసుకున్నా పుణ్యం పురుషార్థం కదాని! పోనీ వాల్మీకి రామాయణం గురించో, అరవిందుల వారి సావిత్రి గురించో, గాయత్రీ మహా మంత్రం గురించో మాట్లాడుకుందామంటే చెప్పండి, కూర్చుంటాను...." అంటూ లేచారు.

"మీకింకెలా చెప్పాలో తెలీట్లేదు. ఈ మెట్ట వేదాంతాలూ వేదాంతపు కబుర్లూ కూటికీ గుడ్డకీ రావు. అది మీరు గ్రహించట్లేదు. ఇది లక్షలూ కోట్లతో ముడివడిన వ్యవహారమండీ..."

అరుస్తున్నట్టుగా చెప్పేడు.

"కాదు, వ్యాపారం. మాకు లాభాలక్కర్లేదు. ప్రభుత్వం ఇస్తోన్న పెన్షనే మిగిలిపోతోంది.....!" 'ఇక మీరు లేస్తే కుర్చీలు లోపల పెట్టేసుకుంటా' నన్నట్టు చూశారు శర్మ.

"ఎంత ఉన్నా చాలక ఇంకా ఇంకా కావాలని దేవుళ్ళాడతారంతా. మీరేంటిలా...!" అని ఆగి నోరెళ్ళబెట్టాడు.

"వాళ్ళు మహానుభావులేమో. అంతా నొల్లుకుని పట్టుకుపోతారేమో. మాకంత ఆశా లేదు శక్తీ లేదు..." అనింకేదో అనబోయి ఇంటి ముందు కొచ్చి నిలబడిన ఆవుని చూసి, "ఏమేవ్ గోవుమాలచ్మి వచ్చిందేవ్..." అంటూ అరిచారు శర్మ.

చిర్రెత్తుకురాగా విసుగ్గా చూశాడు రత్నాకరరావు.

"నా కళ్ళు పేలిపోను. చూడేలేదుస్మండీ..." గబగబా నాలుగు అరటి పళ్ళు తీసుకునెళ్ళి మోరెత్తి చూస్తోన్న ఆవుకి పెట్టింది ముసలావిడ. అది తింటోంటే గంగడోలు నిమురుతూ ఆనందంగా చూస్తూ నిలబడింది.

"మరి నన్ను వెళ్ళమంటారా శర్మగారూ?" అసహనంతో అడిగాడు.

"సంతోషం..."

"ఇదే ఫైనలా? ఈ నేల నాకివ్వరా?" చటుక్కున లేచి చెయ్యి ఊపుతూ అడిగాడు.

చిన్నగా నవ్వేరు. "నేలంటే భూదేవి. నీదీ నాదీ ఎలా అవుతుందయ్యా మన పిచ్చిగానీ!" అంటూనే కుర్చీల్ని మడచి లోపలికి పట్టుకుపోయారు.

ఆయన వంకా, లోపలికి వెళ్తోన్న ఆవిడ వంకా పిచ్చిగా కసిగా చూసి విసవిసా కారు దగ్గరికి వెళ్ళాడు రత్నాకరరావు.  ఆ పదడుగులకే ఆయాసం వచ్చేసింది.

'ఒళ్ళు ఇష్టమొచ్చినట్లు పెరిగిపోయింది. ఓ సారి కేరళ వెళ్ళి ప్రకృతి ఆశ్రమంలో చేరాలి. పది పదిహేను రోజులుండైనా కనీసం పదికేజీలు బరువు తగ్గి  రావాలి. ఇక అశ్రద్ధ చెయ్యకూడదు..' అనుకుంటూ కారెక్కి స్టార్ట్ చేశాడు.

తిన్నగా తన రియల్ ఎస్టేట్ ఆఫీసుకి వెళ్ళాడు.

ధుమ ధుమ లాడుతుతోన్న అతడ్ని చూసి మిగతా స్టాఫ్ గమ్మునుండి పోయారు.

"ఆ ముసలి బ్రాహ్మడు మనకి లొంగడు. ఆ ల్యాండుకి నీళ్ళొదులు కోవాల్సిందే" తన సొమ్మేదో పోతున్నంత బాధగా అక్కసుగా అన్నాడు సూపర్వైజర్ శీనుతో.

అవునంటూ తలాడిస్తూ, "ఇద్దరికీ ఎనభై ప్లస్ ఉంటుంది. అయినా చులాగ్గా ఎలా బతికేస్తున్నారో మిస్టరీయేనండి!" అన్నాడతను ఆశ్చర్యంగా.

ఇంతలో వాటర్ డిపార్ట్మెంట్లో పని చేసే యాదగిరి లోపలికొచ్చి విష్ చేశాడు. "ఎట్లున్నరు సార్. ఎప్పుడు సురూ చేస్తున్రు..."

"ఈ పాటికి మొదలవ్వాల్సిందేనయ్యా. చిన్న ప్రోబ్లం వచ్చి పడింది. మధ్యలో పిలకలా మిగిలిపోయిన ముక్క కలుస్తుందేమోనని చూస్తున్నా. అన్నట్టు మా సైటు మధ్యలో ఉన్న ముసలి బ్రామ్మడికి బోరు లేదు. మంజీరా నీళ్ళే దిక్కు. ఆ ఇంటికి ఏదో వంక బెట్టి నాల్రోజులు వాటర్ సప్లై ఆపేస్తే?"

"కుదర్దు. అయ్యేయస్ ఆఫీసర్ రమాదేవి వాళ్ళకి రిస్తెదార్ గావాలి"

"మరెలా చచ్చేదయ్యా!" విసుగ్గా అన్నాడు. ఎన్నో వెంచర్లు చేశాడు గాని ఎక్కడా ఇలాంటి పితలాటకం ఎదురవ్వలేదు!

ఏమీ చెప్పలేక నవ్వేసి వెళ్ళిపోయాడతడు.

"వాళ్ళబ్బాయి మీద మళ్ళీ ఒత్తిడి తేనా?" రత్నాకరరావు స్టాఫ్‌ని అడిగాడు.

"ఫోనే కదా చెయ్యండి..."

డైరీ తిరగేసి శర్మగారబ్బాయి నెంబరు చూసి ఫోన్ చేశాడు.

"నేను... బిల్డర్ రత్నాకరరావుని.. మీ ఇంటికి ఆ ప్రక్క ఈ ప్రక్క వెనకాల ఉన్న ఇళ్ళన్నీ కొనేసి పడగొట్టేశాను. మీ నాన్న చెప్పే ఉంటాడు. అందరిలా కాకుండా మీకు 50% ఇస్తాను. ఇంతకంటే మంచి ఆఫర్ చచ్చినా రాదు. మీ ఇల్లు నాకు ఇచ్చెయ్యమని మీ నాన్నకి నచ్చ చెప్పు. ఆయనంటే ముసలోడు. చాదస్తం జాస్తిగా ఉంటుంది. నీకేంటయ్యా పైకి రావాల్సిన కుర్రాడివీ, ఆస్తులు పెంచుకోవాల్సిన వాడివీనూ. ఎలా వోలా ఒప్పించెయ్. మొత్తం రొక్కం కావాలన్నా అరేంజ్ చేస్తాను. అలాంటి ఇల్లే కావాలంటే సిటీ అవుట్‌స్కర్ట్‌లో అరెకరం భూమి కొనుక్కుని ఇంతకంటే పెద్ద ఇల్లు కట్టుకుని ఊరేగవచ్చని చెప్పు..."

"సారీ అండీ. ఆ ఇల్లు పడగొట్టి అన్ని సౌకర్యాలతో ఇంకో డాబా కట్టించి ఇస్తానన్నా ఆయన ఒప్పుకోలేదు. ఆయన ఇష్టాన్ని నేనెలా కాదన గలను చెప్పండి?"

"మీ అందరికీ వేపకాయంత, కాదు కాదు బత్తాయి కాయంత వెర్రి ఉందయ్యా..." అనేసి విసురుగా ఫోన్ పెట్టేశాడు.

"ఇక దాన్ని మర్చిపోయి మనం కనస్ట్రక్షన్ మొదలు పెట్టెయ్యడం మంచిది. లెవెల్ చేస్తుంటేనే చాలా ఎంక్వైరీ లొచ్చాయండీ..."

"అందుకేరా ఇంత దేబిరిస్తోందీ. అది కలిస్తే లుక్కూ వాల్యూ పెరిగి దగ్గర దగ్గర కోటి కలిసొస్తుంది తెలుసా?"

శీను తలొంచుకున్నాడు.

"ఆ ఇద్దర్లో ఒక చిలక ఎగిరిపోతే తప్ప ఇల్లు ఖాళీ అవదు" అక్కడే ఉన్న తాపీమేస్త్రి అన్నాడు తాపీగా.

నుదురు ముడి వేసి, కళ్ళు చిన్నవి చేసి, గద్దలా చూసాడు రత్నాకరరావు.

"మనమే ఎగరగొట్టేస్తే?"

ఉలిక్కిపడి కించిత్తు భయంగా చూశారంతా.

నవ్వాడు. "పాములోళ్ళు దొరుకుతారుగా! పెరట్లో ఒకటి వదిలితే చాలు మన పనైపోతుంది...!"

అప్పుడు జరగబోయేది ఊహించుకుని కలవరపడ్డాడు శీను. "పాపం! పార్వతీ పరమేశ్వరుల్లా ఉంటారండి!" గబుక్కునన్నాడు.

"మరింకెలా చావమంటావు చెప్పు?" అరిచాడు. అతడు నోరు మూసేసుకున్నాడు.

"ఏదోటి చెయ్యాలి. పాముని పెరట్లో వదలటమో, స్లంపులో విషం కలపడమో, కరెంటు షార్ట్ సర్క్యూట్ చెయ్యడమో ఏదోటి చెయ్యాలి. ఎలాగైనా సరే ఆ యమ్‌ఐజీ నాక్కావాలి. బాగా ఆలోచించండి. మెదళ్ళకి బాగా పదును పెట్టండి..." తనకు తెలీకుండానే బిగ్గరగా అరచి చెప్పాడు.

ఆయాసం ఎక్కువయ్యింది. డ్రాయర్ సొరుగులోంచి ఇన్ హేలర్ తీసి కాప్స్యూల్ అమర్చి పీల్చాడు.

"అర్థమైందిగా. అంతా కలిసి బాగా ఆలోచించండి..." మరోసారి చెప్పి ఆఫీసులోంచి బయటపడ్డాడు.

ట్రాఫిక్ హెవీగా ఉంది. ఒళ్ళు మండింది. ధుమ ధుమ లాడాడు. అందర్నీ కసిగా తిట్టాడు.

సెల్ మ్రోగింది. లైన్లో కామేశం. అతడింకో బిల్డర్.

"రేపు నైన్‌కి భూమి పూజ. తప్పకుండా రా.."

"ఏ సైట్? పెర్సంటేజ్ ఎంతేవిటి?"

"ఫార్టీ త్రీ"

"ప్రైమ్ సైట్ ఫార్టీ త్రీకి? నక్కని తొక్కావ్. కంగ్రాట్స్. రేపు కలుద్దాం అయితే.."

'ఆ ముసలోడు ఒప్పుకునుంటే తనూ ఈ ముహూర్తానికే కానిచ్చేవాడు. దసరా టైంకి రెండు శ్లాబులు పడేవి. బుక్కింగ్స్ పీక్‌లో ఉండేవి. ఫ్చ...అంతా తారుమారయ్యింది. ఇదంతా ఉఫ్‌మని ఊదితే ఆమడ దూరం వెళ్ళిపడే ఒక్క బక్క పీనుగు వల్ల!' చిర్రు బుర్రు లాడాడు. చిర చిర మండాడు.

ఇంటి కెళ్ళాడు. తన పార్కింగ్ ప్లేస్‌లో ఎవరిదో బైక్ పెట్టి ఉంది.

వాచ్‌మేన్ మీద కళ్ళు మూసుకుని పడ్డాడు. అతడు వణకుతూ వచ్చి బైక్‌ని ప్రక్కకు మార్చాడు.

లిఫ్టు సమీపించాడు. కరెంటు లేదు. గుండె గుభిల్లుమంది.

తన ఫ్లాట్ నాలుగో అంతస్తులో ఉంది. వాచ్‌మేన్ వెనకే వచ్చి కరెంటు పది నిమిషాల క్రితమే పోయిందని చెప్పాడు. అసహనంతో మండుతూ నేలని బూటు కాలితో తన్నాడు

రత్నాకరరావు.

"ఇవాళేదో శని పట్టినట్టుగా ఉంది" అన్నాడు పైకే.

ఆ తర్వాత 'ఈ సారి ఎలాగైనా అందర్నీ ఒప్పించి జనరేటర్ కొనాలి' అనుకుంటూ మెల్లగా మెట్లెక్కసాగాడు.

ఈ బిల్డింగూ అతడు కట్టిందే. అప్పట్లో జనరేటర్ బ్యాకప్ గురించి బయ్యర్స్ అడిగితే, "మెయింటెనెన్స్ చాలా అవుతుందోయ్" అని చెప్పి త్రోసి పుచ్చేశాడు!

మెట్లెక్కడం చాలా కష్టంగా ఉంది. ఒళ్ళూ, ఒంటి బరువూ అడ్డదిడ్డంగా పెరగనిచ్చినందుకు తనని తాను తిట్టుకుంటూ అతి మెల్లగా మెట్లెక్కి ఎక్కి... ఇంట్లో కెళ్తూనే ఒగురుస్తూ సోఫాలో కూలబడ్డాడు.

భార్య మంచినీళ్ళతో పరుగు నొచ్చింది.

స్థిమిత పడ్డాక అంది "కరెంటొచ్చేదాకా కిందెక్కడైనా వెయిట్ చెయ్యాల్సింది"

"మూడ్ ఖరాబయ్యింది. ఆ ముసలోడు తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని కూర్చున్నాడు. ఏదో అద్భుతం జరిగి ఈ రాత్రికి టపా కట్టేస్తే నా సమస్య తీరిపోద్ది, ఒడ్డున పడిపోతాను!"

"మీకోసం పాపం ఆయన్నెందుకు చావమని శాపాలు పెడతారూ! పోనీలెద్దురూ. మనకింతే ప్రాప్తమనుకుని మిగతా భూమిలో  కడితే సరి..."

కళ్ళెర్ర జేసి చూశాడు. "ఎంత నష్టం వస్తుందో తెలుసా? కోటి...!"

అతడి కోపం తగ్గేక కాఫీ ఇస్తూ అంది "మన చేతిలోకి వచ్చింది పోతే బాధపడటంలో అర్థముంది. రానిది పోతే ఎందుకంత ఇదవటం?"

మిర్రి చూశాడు. జవాబు తోచలేదు. కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కి వాలాడు. మనస్సు పొరల్లో ఏదో తెలీని ఘర్షణ!

ఆ ఇల్లు, ఆ ముసలోళ్ళు, ఆ ఇంటి చుట్టూ ఉన్న తన స్థలమూ కళ్ళముందు మెదిలాయి.

"వూహూ వదల్ను. అది నాకు కావాలి. ఆ నేలని ఎలాగైనా సరే దండోపాయంతోనైనా సరే నాది చేసుకుంటాను" తనలో అనుకోబోయి పైకే అనేశాడు.

భయంగా చూసింది భార్య. "ఎందుకంత మీలో మీరే మథన పడతారు? బీపీ ఎక్కువవుద్ది జాగ్రత్త. దేవుడు చల్లగా చూడాలి గాని  ఇంకో వెంచర్లో ఇంతకింతా కలిసొస్తుంది లెండి..."

అతడలా సమర్థించుకోలేక పోయాడు. సరిపెట్టుకోలేకపోయాడు.

కోటి రూపాయల నోట్ల కట్టలు కళ్ళముందు నుంచి గబ గబా నడిచెళ్ళిపోతూ అతడ్ని ఉద్వేగపరుస్తున్నాయి. ఉద్రిక్తం చేస్తున్నాయి.

నిద్ర సరిగ్గా పట్టలేదు. అటూ ఇటూ అశాంతిగా దొర్లాడు.

హఠాత్తుగా "అమ్మా" అంటూ గుండె పట్టుకున్నాడు.

గుండె నొప్పితో విలవిల్లాడుతోంటే ఏడ్చేసిందతడి భార్య. ఏం చేయాలో తోచక ఇరుగు పొరుగు తలుపులు బాదింది.

అంతా వచ్చారు. అర్జంటుగా ఆసుపత్రికి తీసుకెళ్ళాలన్నారు.

అతడి భారీ శరీరం వంక ఇబ్బందిగా చూశారు. ఒకరు ఆలస్యం చెయ్యొద్దంటూ తొందర పెట్టారు. ఇంతలో బిగ్గరగా మూలిగాడు. భయం భయంగా చూశారంతా.

అతడి ఒళ్ళు చల్లబడింది!

ఘొల్లుమంది భార్య. ముఖా ముఖాలు చూసుకున్నారంతా.

"బాడీని మంచం మీంచి కిందకి దించేద్దాం" ఒకరన్నారు.

"ఇంట్లో ఎందుకు ఏకంగా వరండాలో పెట్టేద్దాం" ఇంకొకరన్నారు.

అదే ఫ్లోర్లో ఉంటోన్న మరొకరు, "శవాన్ని వరండాలో ఉంచితే అందరికీ ఇబ్బంది. ఎక్కడెక్కడో ఉన్న పిల్లలూ బంధువులూ ఎప్పుడొస్తారో ఏమో. అసలు డెడ్ బాడీని నేల మీద పడుకోబెట్టాలి. ఇలా అంతస్తు మీద కాదు. క్రిందికి తీసుకుపోదాం" అన్నారు.

వాళ్ళు గుంపు చింపులు పడుతూనే రత్నాకరరావు శవాన్ని లిఫ్టులో క్రిందికి తీసుకెళ్ళి కారు పార్కింగ్ ఏరియాలో నేల మీద చాప పరిచి పడుకో బెట్టి చేతులు దులుపుకున్నారు!

రత్నాకరరావు కట్టెని ఆప్యాయంగా హత్తుకుంది నేలతల్లి!

* * *

**(నవ్య 12.11.2014)**